ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



'కూటమి'లో జోష్

- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి
- సమష్టి కృషితో నియోజకవర్గాల్లో అభ్యర్థుల బలం రెట్టింపు
- అటు ప్రభుత్వ వ్యతిరేకత, ఇటు జనరంజక మేనిఫెస్టోతో ప్రజల్లో భారీ సానుకూలత
- ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో పవన్ బహిరంగ సభలతో జోష్
- వైసీపీపై ప్రజల్లో విసుగు, బలమైన ఓట్ల సమీకరణాలతో కూటమి నేతల్లో గెలుపు ధీమా
- అటు టీడీపీ, జనసేన స్పీడుతో వైసీపీ అభ్యర్థులకు కునుకు కరువు
- కూటమి బలాన్ని డబ్బు, మద్యంతో ఎదుర్కొనేందుకు అడ్డదారులు
- జనంలో తిరుగుతున్నా గెలుపుపై ధీమా లేక అభ్యర్థుల్లో దిగులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని టీడీపీ, జనసేన అభ్యర్థులు రెట్టించిన ఉత్సాహంతో దూసుకుపోతున్నారు. పోలింగ్ సమయం దగ్గరపడు తుండడంతో గెలుపు ధీమాతో ఎన్నికల రణక్షేత్రంలో ముందుకెళ్తున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ ప్రజాదరణతో విజయం ఖాయమనే లెక్కలతో ముందడుగు వేస్తున్నారు. వైసీపీ అయిదేళ్ల పాలనపై వ్యతిరేకత వెల్లువెత్తు తుండగా... కూటమి జనరంజక మేనిఫెస్టోకు విశేష స్పందన వస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి తూ.గో. జిల్లా నుంచి పోటీ చేస్తుండడంతో ఆ ప్రభావం జిల్లాలోని అన్ని స్థానాలపై సానుకూలత వ్యక్తమయ్యేలా చేస్తోంది. ముమ్మిడివరం మినహా మిగిలిన ఆరు సీట్లలోను పవన్ సభలు నిర్వహించడంతో అభ్యర్థుల గ్రాఫ్ అమాంతం పెరిగింది. దీంతో కూటమి విజయంపై సర్వత్రా బెట్టింగులు పెరిగిపోయాయి. అటు ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఓట్ల సమీకరణ సైతం కూటమికి కొండంత బలంగా విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. కాగా కూటమి స్పీడుకు అధికార వైసీపీకి నేతలకు కునుకు పట్టట్లేదు. డబ్బు, మద్యంతో ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థులు చెమటోడ్చుతున్నా ఫలితాలపై ధీమా లేక దిగులుగా కనిపిస్తున్నారు.

అన్నీ కలిసొస్తున్నాయి...

ఈ ఎన్నికలు జిల్లాలో ప్రతిపక్ష టీడీపీ, జనసేనలకు జీవన్మరణ సమస్యగా మారాయి. అధికారం అండతో వైసీపీ ఈ రెండు పార్టీలను ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పెట్టింది. రకరకాల కేసులతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో కూటమి అభ్యర్థులు పోరాడు తున్నారు. నియోజకవర్గాల్లో గ్రామగ్రామాన తిరుగుతూ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ సమన్వయంతో కూటమి అభ్య ర్థుల విజయం కోసం పని చేస్తున్నాయి. ముఖ్యంగా గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన విడిగా పోటీచేయడంతో ఓట్లు చీలి వైసీపీ లాభపడింది. మండపేట, రాజోలు మినహా అన్ని స్థానాల్లో అప్పట్లో గెలిచింది. 2019 ఎన్నికల్లో రామచంద్ర పురం నియోజకవర్గంలో జనసేనకు 18,529 ఓట్లు పోలవగా టీడీపీకి వచ్చే ఓట్లు చీలిపోయాయి. దీంతో వైసీపీ తరఫున పోటీ చేసిన చెల్లుబోయిన వేణు అత్తెసరుగా 5,168 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచారు. అమలాపురం అసెంబ్లీ స్థానంలో జనసేనకు అప్పట్లో 45,200 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ 25,654 ఓట్లతో గెలిచారు. కొత్తపేట నియోజకవర్గంలో జనసేనకు 35,833 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి కేవలం 4,038 ఓట్లతో ఒడ్డునపడ్డారు. పి.గన్నవరంలో జనసేనకు 36,259 ఓట్లు రాగా వైసీపీ తరఫున పోటీ చేసిన కొండేటి చిట్టిబాబు 22,207 ఓట్లతో గెలిచారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో జనసేనకు 33,334 ఓట్లు పడ్డాయి. దీంతో టీడీపీకి ఓట్లు భారీగా చీలిపోయాయి. తద్వారా వైసీపీ లాభపడి పొన్నాడ సతీష్‌కు మార్ కేవలం 5,547 ఓట్లతో గెలిచారు. కానీ ఈసారి టీడీపీ-జనసేన జట్టుకట్టడంతో ఓట్ల చీలిక భయం లేకుండా పోయింది. తద్వారా అన్ని స్థానాల్లో ఓట్ల సమీకరణ లెక్కలు తమకు కలిసి వస్తాయని టీడీపీ, జనసేన అభ్యర్థులు ఆశాభావంతో వున్నారు.

ఇదంతా ఒకెత్తయితే పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన ఒకపక్క తన ప్రచారం చేసుకుంటూనే అమలాపురం లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాల్లో రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఇప్పటి వరకు ముమ్మిడివరం మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో పవన్ పోటీ ప్రభావం జిల్లాలో మిగిలిన అభ్యర్థులకు అన్ని రకాలుగా కలిసివస్తోంది. రాజోలు, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ముగ్గురూ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్న వారే. వారిపై పవన్ ప్రత్యేక దృష్టిసారించి ప్రచారం చేశారు. చంద్రబాబు సైతం కొత్తపేట, మండపేట, రామచంద్రపురం, అమలాపురం నియోజకవర్గాల్లో ఇప్పటికే సభలు నిర్వహించి అభ్యర్థుల బలాన్ని అమాంతం పెంచారు. దీంతో అటు చంద్రబాబు, ఇటు పవన్ జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల బలం పెంచడం విజయంపై ధీమా వ్యక్తమయ్యేలా చేస్తోంది. ఇదంతా

మరోవైపు ప్రచారం కోసం ప్రజల్లోకి వెళ్తున్న టీడీపీ, జనసేన అభ్యర్థులకు ప్రజల నుంచి ఆదరణ భారీగా లభిస్తోంది. వైసీపీ పాలనలో ఎదుర్కొన్న సమస్యలను వారంతా అభ్యర్థుల ముందు ఏకరువు పెడుతున్నారు. అదే సమయంలో కూటమి మేనిఫెస్టో జగన్ పాలనలో దెబ్బతిన్న అన్ని వర్గాలు తిరిగి కోలుకునేలా ఉండడంతో కూటమి అభ్యర్థులపై సానుకూలత ఏర్పడింది. దీంతో టీడీపీ, జనసేన అభ్యర్థులకు వారి కష్టానికి తోడు అన్నీ అంశాలు కలిసివస్తుండడంతో ఉత్సాహంతో కదులుతున్నారు. కాగా రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికే ఫలితాలు అనుకూలంగా ఉంటాయని జిల్లాలో కోట్లలో బెట్టింగులు జరుగుతున్నాయి. కానీ వైసీపీ వైపు పందేలు కాసే నాథుడు కూడా లేకపోవడం విశేషం.

ఎదుర్కోవడమెలాగో..

ఎన్నికల ప్రచారంలో అధికార వైసీపీ ఉక్కపోతకు గురవుతోంది. ఆ పార్టీ అభ్యర్థులు జనంలోకి వెళ్తున్నా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జగన్ పాలనలో అన్ని రకాల చార్జీలు, పన్నులు పెరగడం, గతుకుల రహదారులు, ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంపై జనం నిలదీస్తున్నారు. వీటికి సమాధానం చెప్పలేక వారంతా నీళ్లు నములుతున్నారు. కొన్నిరోజుల వ్యవధిలో ముమ్మిడివరం, మండపేట, అమలాపురం, కొత్తపేట, గన్నవరం నియోజకవర్గాల్లో అభ్యర్థులపై జనం తిరగబడ్డారు. ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌పై తాళ్లరేవులో మూడుసార్లు స్థానికులు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై తిరగబడి నిలదీశారు. మండపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ఇటీవల దళితుల శిరోముండనం కేసు శిరోభారంగా మారింది. ఈ కేసులో ఆయనకు జైలుశిక్ష పడ్డంతో నియోజకవర్గంలో వ్యతిరేకత పెరిగింది. రామచంద్రపురంలో ఎంపీ బోస్ తనయుడు పోటీ చేస్తుండగా... ఓట్ల కోసం బోస్, త్రిమూర్తులుతో విబేధాలు వీడి చేతులు కలిపారనే విమర్శలున్నాయి. రాజోలు వైసీపీ అభ్యర్థి తనకు టికెట్ రాకపోవడంతో అప్పటికప్పుడు టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకోవడంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమలాపురం పేదలు ఇళ్ల స్థలాలు, తాగునీటి విషయమై విశ్వరూప్‌పై ఆగ్రహంగా ఉన్నారు. కొత్తపేటలో జగ్గిరెడ్డిపై దళితులు కొందరు తిరగబడ్డంతో చుక్కలు కనిపించాయి. గన్నవరంలో అభ్యర్థిని మార్చినా జనాదరణ కనిపించట్లేదు. ఇటీవల సీఎం జగన్ ఈ నియోజకవర్గంలో ఎన్నికల సభలో పాల్గొన్నా జనం మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో కళ్లముందే ఓటమి భయం వైసీపీ అభ్యర్థులకు నిద్ర లేకుండా చేస్తోంది. ఈ నేపథ్యంలో డబ్బు, మద్యం పంపిణీపైనే అధికార వైసీపీ ఆశలు పెట్టుకుంది. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఈ రెండింట్లో కొంత వెనుకబడ్డంతో ఇదే అదనుగా వైసీపీ ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో అడ్డదారులు తొక్కుతోంది. దీనికి నిదర్శనమే ఇటీవల వరుసగా కొన్ని నియోజకవర్గాల్లో యానాం, గోవా మద్యం పట్టుబడడం.

రేపు చంద్రబాబు కాకినాడ రాక

మధ్యాహ్నం కాకినాడ రూరల్‌లో రోడ్‌షో, సాయంత్రం కాకినాడ సిటీలో బహిరంగ సభ

కాకినాడ సిటీ, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం కాకినాడ రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నూజివీడు జంక్షన్‌లో సభ ముగించుకుని హెలికాప్టర్‌లో కాకినాడ చేరుకుంటారు. కొద్దిసేపు విరామం తర్వాత కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కాకినాడ భానుగుడి జంక్షన్ వద్ద బహిరంగ సభలో మాట్లాడతారు. చంద్రబాబు రోడ్‌షో విజయవంతానికి టీడీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోనసీమలో అష్టకష్టాలు



అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో పెన్షన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

అమలాపురంటౌన్,మే2: ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేసేందుకు సచివాలయాల ఉద్యోగులు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం అవ్వాతాతలకు నరకం చూపించింది. బ్యాంకు ఖాతాలకు పెన్షన్ జమచేశామని చెప్పడంతో మండుటెండలో వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్ద పడిగాపులుపడ్డారు. కాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటికే 93 శాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేసినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 2,44,777 మందికి సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో 1,77,436 మందికి రూ.53,23,12,000 విడుదల చేయగా ఇప్పటికే 1,73,352 మందికి రూ.52 కోట్లు పంపిణీ చేసి డీబీటీలో 97.7శాతం ప్రగతి సాధించామన్నారు. ఇంటింటికీ తిరిగి 67,341 మందికి పంపిణీ చేసేందుకు రూ.17,99,37,500 విడుదలైందన్నారు. అందులో 58,492 మందికి రూ.15,64,31,500 పంపిణీ చేసి 86.94 శాతం పూర్తిచేసినట్టు పీడీ చెప్పారు.

అన్ని మండలాల్లో ఇవే పాట్లు

అంబాజీపేట/మామిడికుదురు/మలికిపురం/మండపేట, మే2: అంబాజీపేట ఆంధ్రాబ్యాంకులో లబ్ధిదార్ల ఖాతాకు జమచేసిన పింఛన్లు తీసుకునేందుకు గురువారం వృద్ధులు అష్టకష్టాలుపడ్డారు. అకౌంట్ నిలిచిపోయిందని బ్యాంకు అధికారులు చెప్పడంలో ఖాతాను పునరుద్ధరించుకోవడానికి అవసరమైన పత్రాలకోసం అగచాట్లుపడ్డారు. పైగా పింఛన్ 15 రోజుల తర్వాత అకౌంట్ నుంచి తీసుకోవాలని చెప్పడంతో పింఛన్‌దార్లు మండిపడుతున్నారు. మామిడికుదురు మండలంలో కొందరి పెన్షన్ బ్యాంకు ఖాతాలో జమ కాలేదని చెప్పడంతో పింఛనుదారులు తీవ్ర నిరాశ చెందారు. మలికిపురంలో బ్యాంకులో సర్వర్లు పనిచేయక వారంతా పడిగాపులు పడాల్సి వచ్చింది. మండపేట పట్టణంతోపాటు రూరల్‌లో సర్వర్లు పనిచేయక పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత నెల మాదిరిగా సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయకుండా ఇలా తమకు ఇబ్బంది పెట్టడం ఏంటని పింఛనుదారులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

మాకేంటీ దుస్థితి..



ఒక్కపక్క ఎండవేడి.. నడవలేని స్థితిలో ఉన్నా. ఐనా అకౌంట్‌లో పడిన పింఛను తీసుకునేందుకు ఆంధ్రాబ్యాంక్‌కు వెళ్లాను. అకౌంట్ నిలిచిపోయిందని, బ్యాంకు లావాదేవీలు జరగాలంటే ఆధార్‌కార్డు ఇవ్వాలని మొదటి సూచించారు. తీసుకుని బ్యాంకుకు వెళితే అక్కడ ఉన్న బ్యాంకు అధికారులు ఫొటో కూడా ఇవ్వాలని బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అన్ని డాక్యుమెంట్లు ఇచ్చినప్పటికీ 15 రోజుల తర్వాత డబ్బులు వస్తాయని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. పింఛన్ డబ్బులతోనే మందులు కొనుగోలు చేసుకునే పరిస్థితి నాది. ఈ వయస్సులో మాకేంటీ దుస్థితి..

- గుబ్బల జనార్దనరావు, పింఛన్‌దారుడు, జి.అగ్రహారం, అంబాజీపేట మండలం

పింఛన్.. కష్టాలు

పెంచెన్



సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు

బ్యాంక్ వద్ద వృద్ధుల వెయిటింగ్

మండుటెండలో వడగాడ్పులు తట్టుకుంటూ కిలోమీటర్ల కొద్ది ప్రయాణం, బ్యాంకుల వద్ద తమ వంతు వచ్చేవరకూ పడిగాపులు. మీ ఖాతాలు మనుగడలో లేవు, ఈ పత్రాలు తెస్తే ఆన్‌లైన్ చేసి అప్పుడు డబ్బులు ఇస్తామంటూ సిబ్బంది సమాధానం. మరికొందరికి మీ అకౌంట్‌లో పడిన సొమ్ముల్లో చార్జీలు, బ్యాంకు రుసుములు పోగా ఇంతే మిగిలింది అంటూ చెబుతుండడంతో లబ్ధిదారులకు ఏమీ అర్థంకాని పరిస్థితి. ఇంటింటికి పింఛన్లు ఇవ్వకుండా తమను తీవ్ర అగచాట్లకు గురిచేస్తున్నారంటూ వైసీపీ ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల ఆవేదన.. ఇదీ గురువారం ఉమ్మడి జిల్లాల్లో కనిపించిన దృశ్యాలు.

పండుటాకులపై జగన్ పగ

- వైసీపీ ఓటు అరాజకీయం
- బ్యాంకుల వద్ద ప్రత్యక్ష నరకం
- వృద్ధులు, దివ్యాంగుల ఆపసోపాలు
- సగం మంది ఖాతాలు ఇన్‌యాక్టివ్
- పింఛను సొమ్ములో చార్జీల పేరిట కోత
- వలంటీర్లతో తెర వెనుక రాజకీయం

(పిఠాపురం)

ఎన్నికల వేళ వైసీపీ సర్కారు తెరతీసిన కొత్త డ్రామా పింఛను లబ్ధిదారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకున్న జగన్ సర్కారుకు ఇది వరకే ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించడంతో టీడీపీ, జనసేన పార్టీల కారణంగానే మీకు ఇంటింటికీ పింఛన్లు తెచ్చి ఇవ్వలేకపోతున్నామనే ప్రచారానికి ఏప్రిల్ నెలలో జగన్ సర్కారు, వైసీపీ నేతలు తెరలేపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే అవకాశం ఉన్నా ఆ విధంగా చేయకుండా గత నెలలో అందరినీ సచివాలయాలకు రమ్మని అక్కడ పంపిణీ చేపట్టారు. దీంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెలలో ఈసీ సూచనలంటూ బ్యాంకు ఖాతాలకు నగదు జమచేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులను అగచాట్లకు గురిచేసింది. ఇప్పుడు మండుటెండలో చెమటలు కారుస్తూ లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నారు. దీనికి టీడీపీ, జనసేన నాయకులే కారణమని చెప్పడం ద్వారా లబ్ధిపొందే ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెలలో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు పడ్డ ఇబ్బందులు చూసిన తర్వాతైనా ప్రభుత్వంలో కదలిక వచ్చి ఇంటింటికీ పంపిణీ చేస్తారని భావించినా ఓట్ల రాజకీయం మరోలా ఆలోచింపజేసిందనే విమర్శలున్నాయి.

కనీస ఏర్పాట్లు కరవు

పింఛను సొమ్ము తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు భారీగా లబ్ధిదారులు తరలివస్తారని తెలిసినా కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో వృద్ధులు, మహి ళలు బ్యాంకుల వద్ద మండుటెండలోనే పడిగాపులు పడ్డారు. పలువురు వడదెబ్బకు గురయ్యారు. వడగాడ్పులు వీస్తాయని, బయటకు రావొద్దని వాతావరణ శాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు కలెక్టరు ప్రకటన జారీ చేసినా వృద్ధులను ఇలా మండుటెండలో తిప్పుతారా అని పలువురు మండిపడుతున్నారు. వారికి ఏమైనా అయితే బాధ్యత ఎవరిదని అంటున్నారు. మరో వైపు పలువురికి బ్యాంకు ఖాతాలు ఉన్నా సొమ్ములు జమకాలేదు. దీనికి ఎన్‌సీపీఐ (నేషనల్ పేమెంట్ పోర్టల్)తో ఆధార్ అనుసంధానం కాకపోవడం కారణమని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి బయోమెట్రిక్ వేయాలని సూచిస్తున్నారు. బ్యాంకుల వద్ద ఎలా నగదు డ్రా చేయాలి, ఉన్న ఇబ్బందులు, ఏయే పత్రాలు తీసుకురావాలి తదితర సమాచారాన్ని అందించేందుకు బ్యాంకు సిబ్బంది సతమతమయ్యారు. ఇక్కడ సచివాలయాల సిబ్బందిని అందుబాటులో ఉంచితే లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పిఠాపురాన బ్యాంక్‌లో పింఛనుదారుల క్యూ

ఇక్కడా రాజకీయమే

బుధవారం బ్యాంకులకు వచ్చి సొమ్ములు తీసుకోకుంటే వెనక్కిపోతాయని వలంటీర్లు (ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు, రాజీనామా చేసిన వారు) చెప్పడంతో లబ్ధిదారులంతా ఒకేసారి బ్యాంకులకు వచ్చినట్లు చెబుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల కారణంగానే మీకు ఈ పరిస్థితి వచ్చిందంటూ వారు లబ్ధిదారుల వద్దకు వెళ్లి చెబుతున్నట్టు ఆరోపణలున్నాయి. కొన్ని మండలాల్లో నేరుగానే ఈ విధంగా ప్రచారం సాగించినట్టు సమాచారం. లబ్ధిదారుల అగచాట్లకు ప్రభుత్వ నిర్ణయం కారణం కాగా... దానికి టీడీపీ, జనసేనలను బాధ్యులను చేయడంపై ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. ఇలా ప్రచారాలు చేసిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నెట్ సెంటర్లకు కాసుల పంట

ఆత్రేయపురం: జాతీయ బ్యాంకుల వద్ద వృద్ధులు, పింఛన్ల నగదుకు గురువారం ఉదయం పడిగాపులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులుపడ్డారు. ఆధార్ లింక్, బ్యాంకు అకౌంట్ ఉన్న వారికి ఖాతాల్లో నగదు జమైంది. కానీ కొన్ని ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ లేకపోవడంతో చార్జీల పేరిట కట్ చేసి మిగిలిన బ్యాలెన్స్ ఇచ్చారు. కొంతమంది పింఛన్‌దారులు నెట్ సెంటర్లకు వెళ్లి మినీ బ్యాంకుల్లో ఆధార్ కార్డు వేలి ముద్రతో నగదు తీసుకుంటున్నారు. ఆయా నెట్ సెంటర్లలో ఒక్కొక్క పింఛన్‌దారు నుంచి రూ.30 వసూలు చేయడంతో నెట్ సెంటర్లకు కాసుల పంట పండింది.



ఆత్రేయపురం ఐడీబీఐ బ్యాంక్ వద్ద వృద్ధుల పడిగాపులు

నగదు తీసుకునేందుకు వెళితే షాకులు

నగదు తీసుకునేందుకు బ్యాంకులకు వెళ్లిన వృద్ధులు, మహిళలకు షాక్‌లు మీద షాక్‌లు తగిలాయి. లబ్ధిదారులకు సంబంధించి ఆయా బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో సుమారు 50 శాతం వరకూ మనుగడలో లేనట్టు (ఇన్‌యాక్టివ్)గా బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. తిరిగి యాక్టివ్ చేయించుకునేందుకు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, పాన్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని వారు సూచిస్తున్నారు. లబ్ధిదారుల్లో 90 శాతం మందికి పాన్‌కార్డు ఉండదు. అటువంటి వారు తమకు లేదని చెప్పడంతో మిగిలిన పత్రాలు తీసుకురావాలని సూచిస్తున్నారు. మరో వైపు మే నెలకు పడిన పింఛన్ సొమ్ము రూ.3 వేలు డ్రా చేసుకునేందుకు ఫారాలు నింపి ఇచ్చిన వారికి మీ ఖాతాలో అంత నగదు లేదని, మీరు బ్యాంకు ఖాతా వాడనందున, కనీస నగదు లేకపోవడంతో చార్జీలు, రుసుములు పేరిట సొమ్ములు కట్ అయ్యాయని బ్యాంకు సిబ్బంది చెబుతుండడంతో ఆ సొమ్ముపైనే ఆధారపడిన లబ్ధిదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

గత నెల సాఫీగా.. ఈ నెల కుట్రతో..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మొన్నటి వరకు టార్గెట్ టీడీపీ.. ఇప్పుడు కూటమి.. ఇదే వైసీపీ పాలకులు అధికార దండం పట్టుకున్న నాటి నుంచీ సాగుతున్న రాజకీయ కక్ష కథా చిత్రమ్. రాజకీయ జగన్మాయా నాటకమ్. ఏదేమైనా టీడీపీపై బురదజల్లడం ఒకటే అంతిమంగా జగన్ లక్ష్యం. ఈ జాడ్యం చివరికి పింఛను తీసుకునే అవ్వాతాతల్నీ వదల్లేదు. ప్రభుత్వ పథకాల పంపిణీకి వలంటీర్లను ఎన్నికల సంఘం దూరం పెట్టిన విషయం తెలిసిందే. దీంతో మార్చి నెల పింఛన్లను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. ఇది సునాయాసంగా రెండ్రోజుల్లో పూర్తయింది. కానీ ఈ నెల పింఛను విషయంలో ప్రభుత్వం కుట్రపూరిత నిర్ణయం తీసుకుందనడంలో సందేహం లేదు. ఈ నెల సామాజిక భద్రత పింఛన్లను బ్యాంకుల ఖాతాల్లో జమచేస్తామని పాలకులు చెప్పారు. మార్చి, ఏప్రిల్ (మే 1 నుంచి పంపిణీ) నెల పింఛన్ల నడుమ నెల సమయం ఉంది. ఈలోపు పింఛను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలపై కసరత్తు జరగలేదు. ఎన్ని ఖాతాలు ఆధార్‌కి అనుసంధానమై ఉన్నాయి?, ఎన్ని ఖాతాలు మూసేశారు, ఎన్ని ఖాతాల్లో లావాదేవీలు ఆగిపోయాయి. ఎన్ని సవ్యంగా పనిచేస్తున్నాయనే అంశాలను పట్టించు కోలేదు. ఐదేళ్ల బటన్ నొక్కుడు పరిపాలన సాగించిన జగన్‌కి ఆ విషయాలన్నీ తెలుసు. కానీ ముసలి ప్రాణాలతో చెలగాటమాడి ఆ పాపాన్ని బురదగా మార్చి టీడీపీపై చల్లి ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుట్రతోనే ఉద్దేశపూర్వకంగానే పింఛను లబ్ధిదారులను ఎండలో ఉక్కిరిబిక్కిరి చేసినట్టు పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. ఈ కుట్రలో భాగంగా గత నెల కొందరు ప్రాణాలు కోల్పోయినా జగన్‌కి పట్టలేదు. ఇప్పటికే ఈ కుట్రను అర్థం చేసుకున్న లబ్ధిదారులు ఓటుతో సమాధానం చెప్పడానికి సిద్ధమవుతున్నారు.



అన్ని వర్గాలూ మావైపే

పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి హామీలిచ్చి విస్మరించింది. సీఎం జగన్ పర్యటించిన రెండుసార్లూ... ఎమ్మెల్యే చెప్పారు... నేనిచ్చేస్తానని ప్రజలను మోసం చేశారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దీర్ఘకాలిక సమస్యలను పక్కనపెట్టి హంగు, ఆర్భాటాలతో ఐదేళ్ల గడిపేశారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని రహదారుల అభివృద్ధిని విస్మరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లంక గ్రామాల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తాము. గత ప్రభుత్వాల హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తాము.

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్ని వర్గాలూ కూటమి వైపే ఉన్నాయంటున్నారు.

ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.... 7లో

త్వరలో ప్రజా పాలన రాబోతోంది

ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు



కాట్రేనికోన, మే 2: కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో త్వరలోనే ప్రజా పాలన రాబోతోందని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐదేళ్ల జగన్ విధ్వంసకర పాలన నుంచి విముక్తి పొందేందుకు ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి విజయం చేకూర్చాలని కోరారు. గురువారం ఆయన అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. చిలకచెరువులో ప్రారంభమైన ప్రచారం ఎంతో ఉత్సాహంగా కొనసాగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజునే విధ్వంసకర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ప్రతి ఓటరూ చైతన్యంతో ఓటేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని రక్షించుకోవాలంటే కూటమిని గెలిపించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముమ్మిడివరం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. జనసేన, బీజేపీ నాయకులు పాల్గొని సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, చెల్లి అశోక్, ఆకాశం శ్రీను, రంబాల రమేష్, మోకా బాలప్రసాద్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సత్తాల ప్రసాద్, వెంట్రు సుధీర్, విత్తనాల బుజ్జి, విత్తనాల వెంకటరమణ, మోకా అప్పాజీ, నూదా బాబూరావు, నంద్యాల వెంకటేశ్వరరావు, కోటిపల్లి సత్యనారాయణ, మోకా లోవరాజు, జొన్నాడ రాజారావు, రంబాల చిట్టిబాబు, రంబాల దొరబాబు, గుద్దటి జమ్మి, నూకల దుర్గా, రంబాల చౌదరిబాబు, పోలిశెట్టి పెద్ద, మాగాపు పట్టాభి, మాగాపు మల్లేష్, మాగాపు బుల్లియ్య పాల్గొన్నారు.



కాట్రేనికోనలో అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న బుచ్చిబాబు



ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి బుచ్చిబాబుకి ఆత్మీయ స్వాగతం, సత్కారం

రెండు విడతల్లో హోం ఓటింగ్

జిల్లాలో 1,251 మంది దరఖాస్తు

అమలాపురం టౌన్, మే 2: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, 40 శాతం పైబడి మంచాలకే పరిమితమైన దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయం కల్పించింది. జిల్లాలో 85ఏళ్లు పైబడిన వృద్ధులు 8,343 మంది ఉన్నారు. దివ్యాంగులు 25,998 మంది ఉన్నారు. కానీ హోం ఓటింగ్‌కు 1,251 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక బృందాలను నియమించినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో మొదటి విడత, 9, 10 తేదీల్లో రెండో విడత హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గాల వారీగా అత్యధికంగా పి.గన్నవరంలో 421 మంది, అత్యల్పంగా కొత్తపేటలో 63 మంది, రామచంద్రపురంలో 65 మంది, ముమ్మిడివరం 172 మంది, అమలాపురంలో 109 మంది, రాజోలులో 161 మంది, మండపేటలో 260 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.





'లెక్క' తేలుస్తారు

- నామినేషన్ల దగ్గర నుంచి ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందే
- ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇబ్బందే

అంబాజీపేట, మే 2: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు ఖర్చులు చూపించాల్సిందే. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థి రూ. 95 లక్షల వరకూ ఖర్చు చేసుకోవాల్సి ఉంది. నామినేషన్ నాటి నుంచి ఈ ఖర్చులు అమలులోకి వస్తాయి. అభ్యర్థి జాతీయ బ్యాంకుల్లో ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు ఖర్చులను నమోదు చేస్తారు. అభ్యర్థులు ఖర్చుపెట్టిన లెక్కలను ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులు అప్పగించాలి. లెక్కలను సరైన సమయంలో చూపకున్నా వారిపై వేటు పడటంతో పాటు తర్వాత ఎన్నికలలో పోటీ చేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఖర్చు చేయకూడదు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, సామగ్రి అభ్యర్థిది అని తెలితే అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజువారీగా అభ్యర్థులు ఖర్చుతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధనం, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్‌మీడియా ప్రకటనలకు చేసే ఖర్చును అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికి బిల్లు సమర్పించాలి.

పెరుగుతున్న వ్యయ పరిమితి

ఐదేళ్లకు ఒక్కసారి జరిగే ఎన్నికల వ్యయ పరిమితి క్రమేపీ పెరుగుతోంది. 1952లలో సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష ఉండేది. 1957లో రూ.2 లక్షలు, 1962లో రూ.3 లక్షలు, 1971లో రూ.4 లక్షలు, 1975లో రూ.5 లక్షలు, 1984 రూ.10 లక్షలు, 1991లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009లో రూ26 లక్షలు, 2014లో రూ.28 లక్షలు, 2019లో రూ.30 లక్షలు పరిమితిని నిర్ణయించారు. ప్రస్తుతం రూ.40 లక్షలు నిర్ణయించారు.



బ్యాంకు లావాదేవీలు పైపైకి..

జగ్గంపేట, మే 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ రూ.50వేలు మించి నగదుతో ప్రయాణించకూడదనే నిబంధనతో ప్రజలకు చిక్కులు ఎదురవుతున్నాయి. ఏదొక సందర్భంలో ఎక్కువ డబ్బు పట్టుకెళ్లాల్సిన పరిస్థితిలో బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ బ్యాంక్ అకౌంట్‌లో వేసుకుని తమకు అవసరమైనప్పుడు మరలా బ్యాంకు ఖాతాల్లోని నగదు విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఉదయం బ్యాంకుల్లో డబ్బులు వేయడం సాయంత్రానికి తమ గమ్యస్థానాలకు చేరుకున్నాక డబ్బులు విత్‌డ్రా చేయడం చేస్తున్నారు. కొంతమందికి బ్యాంకింగ్‌పై అంత అవగాహన లేకపోవడంతో డబ్బుతో ప్రయాణించడానికి నిబంధనలు అడ్డురావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు డబ్బులు వేయడం తీయడంతో బ్యాంకింగ్ సర్వర్లపై అధిక భారం పడడంతో అవి నిలిచిపోతున్నాయి.





ప్రచారం హోరెత్తుతోంది..

మైకుల్లోను, సోషల్ మీడియాలోనూ దూకుడు

సెల్‌ఫోన్లకు వాయిస్ కాల్స్, సంక్షిప్త సందేశాలు

సామర్లకోట,మే 2: ఈ ఎన్నికల్లో నాయకులు గతానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైకులతో హోరెత్తిస్తుండగా, ఇళ్లల్లో సెల్‌ఫోన్‌లకు అభ్యర్థుల వాయిస్‌తో ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, స్మార్ట్ ఫోన్లు ప్రతీ ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సాప్ ద్వారా ప్రతీ అంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా చెప్తున్నారు. వారం రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల మద్దతుదారులు పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్ చేసి వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీని వలన ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో ఫోన్ లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడం లేదు. బంధువులు, హితులు పనులపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమకపడుతున్నారు. ప్రశాంతత కోరుకునే గ్రామీణులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా అనేక సార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగుచెందుతున్నారు.

గీత దాటితే శిక్షార్హులే..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం నేరం. ఈ నేరాలకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 సెక్షన్ 123(1) ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం భయందోళనలకు గురి చేయడం, కులమత విద్వేషాలను పెంచటం, వ్యక్తిగత విషయాలను విమర్శించటం నేరం. సెక్షన్ 125 ప్రకారం శతృత్వం కలిగించటం నేరం,. సెక్షన్ 126 ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో ప్రచారం చేయటం కూడా నేరం. సెక్షన్ 127 ప్రకారం ఇతరుల సమావేశాలకు భంగం కలిగించటం 127 (ఎ) ప్రకారం పోస్టర్లు, కరపత్రాలపై నియంత్రణ లేకపోవటం కూడా నేరం.. సెక్షన్ 128 ప్రకారం రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించటం నేరం. సెక్షన్ 130,131,132, ప్రకారం పోలింగ్ కేంద్రాలు వద్ద ప్రచారం చేయటం క్రమశిక్షణ లేకుండా బూత్‌ల వద్ద ప్రవర్తించటం నేరం. సెక్షన్ 133 ప్రకారం పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటర్లను వాహనాల ద్వారా తరలించటం నేరం. సెక్షన్ 134 ప్రకారం ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ తాయిలాలు అందించటం నేరం, సెక్షన్ 135,135ఎ, 136 ప్రకారం పోలింగ్ కేంద్రాలలోకి చొరబడటం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను, రికార్డులను తొలగించటం నేరం, సెక్షన్ 171జీ ప్రకారం ఎన్నికలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేయటం నేరం. సెక్షన్ 172హెచ్, 172ఐ ప్రకారం ఖర్చులు జమా లెక్కలు చెప్పకపోవటం వంటి తదితర నేరాలన్ని ఎన్నికలు ప్రవర్తనా నియమవళి కిందకే వస్తాయి.

ఎవరేం చేస్తారు..?

- ఎన్నికల విధుల్లో అధికారుల బాధ్యతలు కీలకం
- ఒక్కో అధికారిది ఒక్కో విధి..

మండపేట, మే 2: త్వరలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో బిజీ అయిపోయారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధికారి మొదలుకుని పోలింగ్ స్థాయి అధికారి వరకు అందరూ కీలకమే.. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల వెల్లడి వరకు అధికారుల పాత్ర చాలా కీలకం. ఇక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసే బాధ్యత కూడా వారిదే.. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు వివిధ పోలింగ్ ఆఫీసర్లు నిరంతరం ఎన్నికల విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణ నియంత్రణకు లోబడి ప్రతి జిల్లాకు ఒక అధికారి ఉంటారు. సంబంధిత కలెక్టర్ ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు చేస్తూ ఎన్నికల నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తారు.

ఆర్వో

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహణ నేపథ్యంలో ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉంటారు. ఆయా నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా జేసీ స్థాయి అధికారి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అభ్యర్థుల గుర్తుల కేటాయింపులు తదితర వాటిని వీరే చూస్తారు. అభ్యర్థుల తుది జాబితా వారే తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి తదితర పనులు ఆర్వో పర్యవేక్షణలో జరుగుతాయి. ఆర్వో అన్ని విధాలుగా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడతారు.

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలకు ఓ సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట్ల 144 సెక్షన్ విధించే అవకాశం సెక్టోరల్ అధికారికే ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్‌బూత్‌లు గుర్తించి అక్కడ బందోబస్తుకు సిఫార్సు చేస్తారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గ స్థాయిలో ఉండే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎక్కడా మద్యం, నగదు పంపిణీలు జరగకుండా ఓటర్లను రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురిచేయకుండా చూస్తారు. బహుమతుల తరలింపునకు అడ్డుకట్ట వేస్తారు.


మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరుపై నివేదికను రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపటంలో వీరి పాత్ర కీలకం. ఇక కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులు అందజేయటం, ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడటం బీఎల్వోల బాధ్యత.. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, ఓటరు జాబితాల ప్రదర్శన, పోలింగ్ కేంద్రాలు మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటర్ల జాబితా అధికారులు

ఓటర్ల జాబితాను తయారు చేయటం ఈయన బాధ్యత. ఓటు నమోదు చేసుకునేవారు జాబితాలో పేర్లు తప్పుగా ఉంటే వారు ఈయనను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు.ఈయన పర్యవేక్షణలో కొంతమంది సిబ్బంది పనిచేస్తుంటారు.

రాష్ట్ర రాజకీయాలలో అనపర్తి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి ఓటర్ల తీర్పును బట్టే రాష్ట్ర పరిస్థితులు ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ ఓటర్లు సామాన్యులను సైతం అందలమెక్కిస్తారు. రామవరం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న నల్లమిల్లి మూలారెడ్డిని నియోజకవర్గ ప్రజలు నాలుగు సార్లు అసెంబ్లీకి పంపగా, అనపర్తి సర్పంచ్‌గా ఉన్న తేతలి రామారెడ్డిని ఇక్కడి ప్రజలు రెండు సార్లు అసెంబ్లీకి పంపారు. సామాజిక వర్గాల ప్రాతిపదికన రెడ్డి ఓటర్లు అధికంగా ఉన్న అనపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి 2019వరకు జరిగిన తొమ్మిది ఎన్నికల్లో ఐదుసార్లు పట్టం కట్టారు. 2014 ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి తీరుతుందని విశ్లేషకుల అంచనాలను వమ్ము చేస్తూ ఇక్కడి ఓటర్లు తెలుగుదేశం పార్టీకి పట్టంగట్టారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా అనపర్తిలో బీజేపీ తెరపైకి వచ్చింది. గత ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్డీయే అభ్యర్థిగా బీజేపీ తరపున రంగంలోకి దిగగా వైసీపీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తిరిగి వైసీపీ తరపున బరిలో నిలిచారు.



పడాల సత్యనారాయణరెడ్డి | తేతలి లక్ష్మీనారాయణరెడ్డి | పాలచర్ల పనసరామన్న | వల్లూరి రామకృష్ణ చౌదరి | పడాల అమ్మిరెడ్డి | నల్లమిల్లి మూలారెడ్డి | తేతలి రామారెడ్డి | నల్లమిల్లి శేషారెడ్డి | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి | సత్తి సూర్యనారాయణరెడ్డి


- అనపర్తి ఓటర్ల తీర్పు విలక్షణం
- సామాన్యులను సైతం అందలమెక్కించిన ఓటర్లు
- ఇక్కడ గెలిచే పార్టీకే రాష్ట్రంలో అధికారం వచ్చే సంప్రదాయం
- సర్పంచ్‌లు సైతం ఎమ్మెల్యేలైన వైనం

● (అనపర్తి)

సామాన్యులకు అందలం




అనపర్తిలో ఐటీసీ లిమిటెడ్, ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీ ఉన్నాయి. బిక్కవోలులో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఉంది. అలాగే అనపర్తి నియోజకవర్గం వ్యాప్తంగా చాలా కోళ్ల ఫారాలు ఉన్నాయి. రైస్‌మిల్లులకు కూడా ఈ ప్రాంతం ప్రసిద్ధి



నియోజకవర్గ ఆవిర్భావం

1952లో నియోజకవర్గం ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. 2009 ఎన్నికలలో నల్లమిల్లి శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి తనయుడు రామకృష్ణారెడ్డి మూలారెడ్డి వారసుడిగా బరిలో దిగారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి మేనల్లుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పోటీ చేశారు. అయితే ఇక్కడ స్వల్ప మెజారిటీతో రామకృష్ణారెడ్డి (తెలుగు దేశం) ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో తిరిగి వీరిద్దరే ప్రధాన పోటీలో నిలవగా వైసీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై 55 వేల భారీ మెజారిటీతో విజయం సాధించారు.



జి.మామిడాడలో కోదండ రామాలయం

గుర్తింపు పొందిన నేతలు

1971లో నల్లమిల్లి మూలారెడ్డి అనపర్తి మండల రామవరం సర్పంచ్‌గా గెలుపొంది 1983లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా సేవలందించారు. అప్పట్లో సమితి ఎన్నికలలో ఉండవిల్లి సత్యనారాయణమూర్తిపై పోటీ చేసి రాష్ట్ర ప్రముఖుల వద్ద గుర్తింపు పొందారు. నమ్ముకున్న వారి కష్టాలను తీర్చే నాయకుడిగా పేరు పొందారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. తేతలి రామారెడ్డి అనపర్తి గ్రామ సర్పంచ్‌గా రాజకీయాల్లో ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1989, 2004లో రెండు పర్యాయాలు శాసనసభ్యునిగా పనిచేశారు. సౌమ్యుడిగా పేరుగాంచిన తేతలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తొలుత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తదుపరి 2009 ఎన్నికలలో అనపర్తి అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



అనపర్తి దేవీచౌక్

వేధిస్తున్న సమస్యలు

ఎప్పటికి పరిష్కారమయ్యేనో..

అనపర్తి నియోజకవర్గంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకం మరమ్మత్తులు చేపట్టి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన పదవీకాలంలో వేలాది ఎకరాలకు నీరందించారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో తిరిగి మరమ్మత్తులకు గురైనా పూర్తి స్థాయిలో మరమ్మత్తులు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. . వేమగిరి నుంచి సామర్లకోట వరకు ఎర్రకాలువలో అనేక వ్యర్థాలు కలిసి నీరు కలుషితమవుతోంది. మురుగు నీరు పోయేందుకు ఈ కెనాల్‌కు అనుసంధానంగా డెడికేటెడ్ చానల్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని నిర్మాణం కోసం మాజీ శాసన సభ్యుడు తేతలి రామారెడ్డి ప్రయత్నాలు చేసినప్పటికి ఫలితం లేకపోయింది. ఈ సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాల్సి ఉంది. అదే విధంగా వేమగిరి సామర్ల కోట కెనాల్ రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది.

అనపర్తి నియోజకవర్గంలో విలక్షణ ఓటరు

రాజకీయ చరితం

భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ద్విసభ నియోజకవర్గంగా అనపర్తి నియోజకర్గం ఏర్పడింది. అప్పటికి కొనసాగుతున్న పిర్కాల వ్యవస్థలో అనపర్తి, సోమేశ్వరం పిర్కాలను అనపర్తి నియోజకవర్గంగా రూపొందించారు. ఈ ద్విసభ నియోజకవర్గానికి తొలిసారిగా కొంకుదురు గ్రామానికి చెందిన పడాల సత్యనారాయణరెడ్డి(కాంగ్రెస్) ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955లో జరిగిన ఎన్నికలలో తేతలి లక్ష్మీనారాయణరెడ్డి(ప్రజాపార్టీ) ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన పునర్విభజనలో అనపర్తి నియోజకవర్గం నుంచి సోమేశ్వరం పిర్కాను తొలగించి తాపేశ్వరం పిర్కాను జత చేశారు. ఈ పునర్విభజనతో అప్పటి వరకు రెడ్డి సామాజిక నియోజకవర్గంగా కొనసాగిన అనపర్తి కమ్మ సామాజిక వర్గం చేతుల్లోకి వెళ్లింది. 1962 నుంచి 1967 వరకు మండపేటకు చెందిన పాలచర్ల పనసరామన్న (కమ్యూనిస్టు పార్టీ), 1967 నుంచి 1978 వరకు వల్లూరి రామకృష్ణ చౌదరి(కాంగ్రెస్) ఎమ్మెల్యేలుగా పనిచేశారు. తిరిగి 1978లో జరిగిన పునర్విభజనలో అనపర్తి, సోమేశ్వరం పిర్కాలు జతకలిశాయి. దీంతో రెడ్డి సామాజిక వర్గానికి రాజకీయ నాయకత్వం లభించింది. 1978లో కొమరిపాలెంకు చెందిన పడాల అమ్మిరెడ్డి(జనతాపార్టీ) తరపున ఎన్నికయ్యారు. 1983,85,94,99 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున నల్లమిల్లి మూలారెడ్డి ఎన్నికయ్యారు. 1989,2004లో తేతలి రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో జరిగిన పునర్విభజనలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు కలిసి నియోజకవర్గంగా ఏర్పడ్డాయి. పునర్విభజన తర్వాత 2009 ఎన్నికలలో నల్లమిల్లి శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన ఎన్నికలలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ తరపున పోటీ చేసిన డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం

నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మొత్తం గ్రామాలు 58
మొత్తం ఓటర్లు : 2,23,253
మహిళలు : 1,13,930
పురుషులు : 1,09,323
పోలింగ్ కేంద్రాలు 228

సంవత్సరం	విజేత	పార్టీ
1952	పడాల సత్యనారాయణరెడ్డి	కాంగ్రెస్
1955	తేతలి లక్ష్మీనారాయణరెడ్డి	ప్రజాపార్టీ
1962	పాలచర్ల పనసరామన్నచౌదరి	కమ్యూనిస్టు పార్టీ
1967	వల్లూరి రామకృష్ణ చౌదరి	కాంగ్రెస్
1972	వల్లూరి రామకృష్ణ చౌదరి	కాంగ్రెస్
1978	పడాల అమ్మిరెడ్డి	జనతాపార్టీ
1983	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1985	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1989	తేతలి రామారెడ్డి	కాంగ్రెస్
1994	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
1999	నల్లమిల్లి మూలారెడ్డి	తెలుగుదేశం
2004	తేతలి రామారెడ్డి	కాంగ్రెస్
2009	నల్లమిల్లి శేషారెడ్డి	కాంగ్రెస్
2014	నల్లమిల్లి రామకృష్ణారెడ్డి	తెలుగుదేశం
2019	డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి	వైసీపీ

అన్ని వర్గాలూ మావైపే



ఉమ్మడి మేనిఫెస్టోకు అన్ని సామాజికవర్గాల నుంచి విశేష స్పందన

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తా

ప్రజా సమస్యలు వినేందుకు ప్రత్యేక 'డయల్ యువర్ ఎమ్మెల్యే' ఆలోచన

పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

సత్యనారాయణ: ప్రతిరోజూ అశేష ప్రజానీకం మధ్య జోరుగా హుషారుగా సాగుతోంది. ప్రజా స్పందనతో ఎండ వేడి, అలసట తెలియట్లేదు.

ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?

అన్ని వర్గాల ప్రజల నుంచీ స్పందన చాలా బాగుంది. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, మైనార్టీల స్పందన విశేషంగా ఉంది. జనసేన, టీడీపీల్లోకి అధికార వైసీపీ నుంచి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుతున్నారు.

మీ గెలుపు అవకాశాలు ఏమిటి, ఎందుకంత ధీమా?

విద్యావంతుడిగా, సౌమ్యుడిగా, వివాదరహితుడిగా, సేవాగుణం కలిగిన వ్యక్తిగా, డాక్టర్ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న వ్యక్తిగా నియోజకవర్గంలో పూర్తి పరిచయాలున్నాయి. వాటికి తోడు పవన్ కల్యాణ్ చరిష్మా, చంద్రబాబు పరిపాలన దక్షత, మోదీ భాగస్వామ్యంతో పి.గన్నవరంలో కచ్చితంగా కూటమిదే గెలుపు.

మెజార్టీ వర్గాల కోసం మీరు ఏం చేయబోతున్నారు?

ఎస్సీ, బీసీ సామాజికవర్గాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసింది. వారి అభివృద్ధి కుంటుపడేలా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకాగానే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వారికే అందేలా చూస్తాం. రద్దు చేసిన 28 పథకాలను పునరుద్ధరిస్తాం. బీసీ కార్పొరేషన్ల ద్వారా వారి అభివృద్ధికి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరయ్యేలా చూస్తాం.

గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయాలు ఏమిటి?

అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి వేణుగోపాలరావు బటన్ నొక్కుడు వేడుకలు, వ్యక్తిగత ఫంక్షన్లు చేసుకోవడం తప్ప నియోజకవర్గ సమస్యలపై ఏనాడూ దృష్టిపెట్టింది లేదు.

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు?

ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. ప్రజలు నాతోనే మాట్లాడేలా 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టే ఆలోచన చేస్తున్నాను.

మీరు గెలిచాక నియోజకవర్గంలో ఏ సమస్యలకు ప్రాధాన్యమిస్తారు?

విద్య, వైద్యం రంగాలకు తొలి ప్రాధాన్యమిస్తాను. అధ్వా నంగా ఉన్న రహదారులు నిర్మాణం, తాగునీరు, వరదల సమయంలో నదీకోతకు గురవుతున్న లంక భూములకు గ్రోయిన్ల నిర్మాణంతో పాటు లంక గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తాను.

కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉన్నారు. ప్రచారంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎలా ఉంది?

నా సోదరులు, నా కుమారుడు గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమవుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. నేను ఉదయం నుంచి రాత్రి వరకు కూటమి పార్టీల నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నాను.

ఎన్నికల హామీలపై జన స్పందన ఎలా ఉంది?

స్పందన చాలా బాగుంది. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలకు విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి పవన్‌కల్యాణ్ ఆలోచన తోడుకావడంతో ప్రజాదరణ మరింత పెరిగింది. కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉంది.

- పి.గన్నవరం

దుర్గాడలో నాగబాబు, హైపర్ ఆది రోడ్‌షో



మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు రూరల్, మే 2: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు బుధవారం రోడ్‌షో నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణంరాజు, స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆదిలతో కలిసి నిర్వహించిన ఈ రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. గ్రామంలోని గొల్లపేట, ఆటోస్టాండు, బాబు హౌస్, వీవర్స్ కాలనీ, రైల్వేస్టేషన్, పల్లపువీధి, రామాలయం సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా సాగిన ఈ రోడ్‌షోకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. ప్రజలు భారీగా రోడ్లపైకి రావడంతో నాగబాబు, వర్మ ఓపెన్‌టాపు జీపు దిగి వారితో కొంతదూరం పాదయాత్ర చేశారు. రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి నాగబాబు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దాలని పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. అధికారంలో లేకపోయినా సినిమాల్లో సంపాదించిన సొమ్మును ఖర్చుపెట్టి ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు కుటుంబాలను ఆదుకోవడంతో పాటు కష్టసమయాల్లో ప్రజలకు అండగా ఉన్నారని చెప్పారు. కాకినాడ సెజ్ ప్రాంతంలో వస్తున్న అరబిందో ఫార్మా సహా ఇతర పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు కల్పిస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాలు నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకువచ్చి ఇక్కడ పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహిస్తామన్నారు. యువతకు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడుతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైపర్ ఆది పంచులే..పంచులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 2: 'మీ ఇంటిలో మంచి జరిగితేనే ఓటు వేయమని జగన్ అంటున్నారు, వారింటిలోనే మాకు మంచి జరగలేదని, ఇద్దరు చెల్లెళ్లు రోడ్డు మీద తిరుగుతున్నారు. వాళ్లింటిలోనే మంచి జరగనప్పుడు మీ ఇంటిలో మంచి జరిగిందంటే నమ్ముతారా' అని జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బుధవారం జనసేన నేత నాగబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మలు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న హైపర్ ఆది జగన్‌పై, వైసీపీ నేతలపై పంచుల మీద పంచులు వేశారు. కల్తీ మద్యం, కల్తీ ప్రభుత్వం పోవాలంటూ కూటమి అభ్యర్థులకు, పిఠాపురం అసెంబ్లీ, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు. ప్రస్తుతం పిఠాపురంలో ఎందుకు పుట్టలేదనే బాధ ఉందని, పుట్టి ఉంటే పవన్‌కు ఓటు వేసే అవకాశం లభించేది అని తెలిపారు. బటన్ నొక్కితే రూ. 10వేలు ఆడవాళ్ల ఖాతాల్లో పడుతున్నాయని జగన్ అంటున్నారని, అదే రోజు సాయంత్రం మగవాళ్ల మూత విప్పితే రూ.30 వేలు పోతున్నాయని చెప్పారు. పొద్దున బటన్ నొక్కుతున్నారు, సాయంత్రం పీక నొక్కుతున్నారని సెటైర్లు వేశారు. పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు ప్రచారంలో వడదెబ్బ తగిలింది అంటున్నారు. అయిదేళ్లల్లో మనకు ఇంతకంటే పెద్ద దెబ్బలు తగిలాయి, రాబోయే రోజుల్లో 151 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులకు వడదెబ్బలు తగులుతాయి, ఇటువంటి డ్రామాలు నమ్మకండి అని సూచించారు. ఆది పంచులకు ప్రజలు నుంచి మంచి స్పందన లభించింది.

విహారంలో విషాదం

సీతపల్లి వద్ద వాగులోకి దిగి ఇద్దరు యువకుల మృతి









రంపచోడవరం/సామర్లకోట, మే 2: అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి సమీపాన ఉన్న విహార ప్రాంతంలోని వాగులోకి దిగి కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఇద్దరు యువకులు గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. సామర్లకోట పట్టణం బ్రౌన్‌పేట, గణేష్ కాలనీలకు చెందిన మొత్తం 13 మంది విహార యాత్రకు వచ్చారు. వారంతా సీతపల్లి సమీపాన వాగులోకి దిగగా వర్ధనపు రాజ్‌కుమార్(28), మాసా అభిలాష్(29) మునిగిపోయారు. కొద్దిసేపటికి మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు వివరించారు. పెయింటింగ్ పనిచేసుకుని కుటుంబాలను పోషించుకునే ఇద్దరూ మృతిచెందడంతో సామర్లకోటలోని బలుసులపేట, గణేష్ కాలనీలు విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటోలో రూ.2.10 లక్షలు సీజ్

అప్పు తెచ్చుకున్న సొమ్ము అంటూ బాధితులు లబోదిబో

గొల్లప్రోలు రూరల్, మే 2: బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకువెళుతున్న నగదును పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేయడం వివాదాస్పదంగా మారింది. అన్ని ఆధారాలు చూపించినా నగదును స్వాధీనం చేసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేబ్రోలు గ్రామానికి చెందిన పి.గంగమణి దుర్గ తన కుటుంబ అవసరాలు నిమిత్తం గొల్లప్రోలు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో బంగారు వస్తువులు తనఖా పెట్టి రూ2.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ మొత్తాన్ని తీసుకుని ఆటోలో ఇంటికి వెళుతుండగా గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తాటిపర్తి జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును గొల్లప్రోలు టోల్‌గేట్ ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించారు. దీనిపై బాధితురాలు తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. బంగారు వస్తువులను బ్యాంకులో తాకట్టు పెట్టి అప్పు తీసుకుని నగదు పట్టుకెళుతుండగా పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారని, అన్ని ఆధారాలు చూపినా వదిలిపెట్టలేదని తెలిపారు. తన కుమార్తె గర్భిణి అని, నిబంధనలకు విరుద్ధంగా నగదు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎన్నికలు అంటూ సామాన్యులను ఇబ్బందులు పెడతారా అని ప్రశ్నించారు. కాగా అధికార వైసీపీ నేతలు బహిరంగంగా నగదు పంపిణీ చేస్తున్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు సామాన్యులపై మాత్రం తమ ప్రతాపం చూపిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

మోదీ సభకు చురుగ్గా ఏర్పాట్లు



ఏర్పాట్లపై చర్చిస్తున్న పోలీసు అధికారులు

కడియం, మే 2: ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన వేమగిరి జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీస్థలంలో ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సభలో ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రానున్నట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీ రాజు తెలిపారు. ఈ సభకు సంబంధించి అధికారులతో చర్చించారు. ఎంతమంది వస్తారు ? ఎన్ని కార్లు ? బస్సులు అనే విషయాలను తెలియజేశారు. ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పక్కాగా చేస్తామని ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ముగ్గురు నేతలు వచ్చేందుకు అనువైన హెలిప్యాడ్ ప్రదేశాలను గురువారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జేసీ తేజ్‌భరత్ పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహారావు, డీపీవో రాంబాబు, డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, ఎంపీడీవోలు రాజ్‌మనోజ్; డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రూరల్ బీజేపీ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

15 బైక్‌లు స్వాధీనం

సామర్లకోట, మే 2: సామర్లకోట, కిర్లంపూడి, గండేపల్లి, రాజానగరం తదితర ప్రాంతాలలో ఇటీవల కాలంలో తాళాలు వేసి ఉన్న మోటార్ సైకిళ్లను దొంగలిస్తున్న మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన బండారు మధుబాబును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి వెల్లడించారు. గురువారం సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు డీఎస్పీ వివరాలు అందించారు. కిర్లంపూడిలో అను మానాస్పదంగా తిరుగుతున్న మధుబాబును పోలీ సులు అదుపులోకి తీసుకుని విచారించడంతో మోటార్ సైకిళ్ల చోరీలు గురించి బయటపడిందన్నారు. బైక్‌ల విలువ సుమారు రూ.5.63 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ మేరకు క్రైం సీఐ అంకబాబు, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ ఎస్‌కే జబీర్‌లను డీఎస్పీ అభినందించారు.



కాట్రేనికోన మండలంలో బైక్‌పై వెళ్తూ వృద్ధురాలితో మాట్లాడుతున్న అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి బుచ్చిబాబు



కాట్రేనికోనలో ప్రచారం చేస్తున్న అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి బుచ్చిబాబు



ఉప్పలగుప్తం మండలం కూనవరంలో ఎన్నికల ప్రచారంలో లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనందరావు

సీ-విజిల్ యాప్‌లో 474 ఫిర్యాదుల పరిష్కారం

అమలాపురం టౌన్, మే 2: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 592 ఫిర్యాదులు అందాయని సీపీవో, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వీటిలో 118 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించామన్నారు. 474 ఫిర్యాదులు ఉండగా వాటిలో 100 నిమిషాలలోపు 436 ఫిర్యాదులను పరిష్కరించామని, ఆ తర్వాత 38 ఫిర్యాదులను పరిష్కరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వెలగపూడిలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి 44 ఫిర్యాదులు అందగా వాటిలో 33 పరిష్కరించామని, మిగిలిన 11 పెండింగులో ఉన్నాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే యువతకు ఉద్యోగాలు

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 2: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని కూటమి తరపున అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగాన్ని విస్తరించడంతో పాటు పరిశ్రమలను తీసుకురావడం ద్వారా 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం దొరికే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తారన్నారు. రాష్ట్రంలో వైసీపీ దోపిడీ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పి ఇంటికి పంపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాట్రేనికోనమండలం వెంకమ్మచెరువు, పొండోలు చెరువు, రామస్వామి తోట, తిమ్మాపురం గ్రామాల్లో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)తో కలిసి హరీష్‌మాధుర్ గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హరీష్ హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం ఉప్పలగుప్తం మండలంలోని కూనవరం, విలసవిల్లి గ్రామాల్లో గురువారం రాత్రి అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుతో కలిసి హరీష్‌మాధుర్ విస్తృతంగా పర్యటించారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతా: హరీష్‌మాధుర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు వర్తక వ్యాపార రంగాన్ని విస్తరింపచేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కూటమి తరపున అమలాపురం లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ప్రధానంగా కొబ్బరి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు కొబ్బరి రైతులకు మంచి ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా లేని విధంగా జిల్లాలో తీర ప్రాంతం ఎక్కువగా ఉండడం, ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నందున టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అమలాపురంలోని యెండూరి కన్వెన్షన్ హాలులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు అమలాపురం నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారన్నారు. కోనసీమ రైల్వే లైన్ నిర్మాణం కోసం ఏ విధమైన చర్యలూ తీసుకోలేదని, కనీసం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు కూడా విడుదల చేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే లైన్ నిర్మాణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోడి గురుకుల పాఠశాలలో ఎన్నో సమస్యలు నెలకొన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయిందన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు చెప్పుకోలేని బాధలతో బాధపడుతున్నారన్నారు. విద్యార్థినులకు కనీసం వాష్‌రూమ్‌లు కూడా లేవని, తిరగని ఫ్యాన్లు, కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యలను ఢిల్లీ స్థాయికి సైతం తీసుకువెళ్లామని వివరించారు. ఎవరైనా తనలాంటి వారికి సమస్యలు చెబితే అటువంటి విద్యార్థులను హాస్టల్ నుంచి బయటికి పంపించి వేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గురుకుల పాఠశాలలను పూర్తిస్థాయిలో ఆధునీకరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు చెరుకూరి సాయిరామ్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయవరం, మే 2: సోమేశ్వరం, రాయవరం, మాచవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఎన్నికల అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి ప్రదీప్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట మం డపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, తహశీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, ఎస్ఐ జి.నరేష్, ఆర్ఐ పి.రామారావు, వీఎల్వోలు పాల్గొన్నారు.

- కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్
- గుడిమెల్లంక, మేడిచర్లపాలెం గ్రామాల్లో ప్రచారం
- కూటమి ప్రభుత్వంలోనే ప్రజలకు ఎంతో మేలు

చంద్రబాబు పాలనలోనే సామాజిక న్యాయం




సన్నవిల్లిలో పెన్షనర్లను కలిసి మేనిఫెస్టో అంశాలను వివరిస్తున్న ఆనందరావు, పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పుతున్న ఆనందరావు



బండారులంకలో ప్రచారం నిర్వహిస్తున్న ఆనందరావు సతీమణి అరుణ

ఉప్పలగుప్తం, మే 2: కూటమి ఆధ్వర్యంలో చంద్రబాబు పాలనలో మాత్రమే అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గురువారం సర్పంచ్ చిక్కం జంగమయ్య ఆధ్వర్యంలో సన్నవిల్లి, చీకట్ల ఏసు ఆధ్వర్యంలో గొల్లవిల్లి, ఆకుల రాము ఆధ్వర్యంలో కూనవరం గ్రామాల్లో ఆయన అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సన్నవిల్లిలో ఆనందరావు సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. గ్రామాల్లో మహిళలు, యువకులు, వృద్ధులను కలిసి కూటమి మేనిఫెస్టోలో వారికి మేలు చేకూర్చే అంశాలను వివరించారు. పెన్షన్ల పెంపు, ఉపాధి కల్పన, ఉచిత బస్సు ప్రయాణంపై వారంతా సంతోషం వ్యక్తం చేశారు. కూటమిని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. అవ్వాతాతల ఆశీర్వాదం తీసుకున్నారు. జనసేన సహకారంతో నిర్వహించిన ప్రచారంలో ప్రజలు సానుకూలంగా స్పందించడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో ప్రచారం కొనసాగించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మద్దింశెట్టి సీతారామస్వామి, గనిశెట్టి వీరాస్వామినాయుడు, నిమ్మకాయల మను, గనిశెట్టి సుబ్బారావు, మెండు గణేశ్వరరావు, తోకల ఏడుకొండలు, గనిశెట్టి అరవింద్, సలాది నాగరాజు, గనిశెట్టి అరవింద్, మారిశెట్టి నాని, బొక్కా శ్రీనివాసరావు, జాన శంకరం, తొత్తరమూడి విజయకుమార్, సర్పంచ్ వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ పాల్గొన్నారు.

భర్త విజయాన్ని కోరుతూ భార్య ప్రచారం

అమలాపురంరూరల్: అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి అరుణ గురువారం బండారులంకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టో ప్రతులను ఇంటింటికీ పంపిణీ చేశారు. తెలుగు మహిళలు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, మాడా మాధవితో పాటు మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, కాశిన బాబి, కొండా సత్యనారాయణరాజు, బట్టు పండు, కాశిన ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. అమలాపురం 25వవార్డులో ఆనందరావు తనయుడు కరణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తనయుడు సత్య ఇంటింటా ప్రచారం చేశారు.

ఈవీఎంల స్టోరేజ్ రూమ్స్ తనిఖీ

అమలాపురం టౌన్, మే 2: కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్టోరేజ్ రూములను పోలీసు ఎన్నికల పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్ గురువారం తనిఖీ చేశారు. కౌంటింగ్ హాళ్లను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి అమలాపురంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో 12మందిని అరెస్టు చేసి తొమ్మిది ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 6.37లీటర్ల ఐఎంఎల్, 41డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 9.52 లీటర్ల ఐఎంఎల్, 45లీటర్ల నాటుసారాస్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. 400లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు.

ఆనందరావుకు మద్దతుగా ప్రచారం

అల్లవరం, మే 2: అమలాపురంఅసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుకు మద్దతుగా మొగళ్లమూరులో మహాజన సోషలిస్టుపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లూటుకుర్తి చిన్నమాదిగ ఆధ్వర్యంలో ప్రచారంచేశారు. ఆనందరావు, హరీష్‌మాధుర్‌లను గెలిపించాలన్నారు.చుట్టుగుళ్ల సత్యనారాయణ, నాగరాజు, దావీదు, ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.2.5లక్షల నగదు పట్టివేత

మండపేట, మే 2: స్థానిక బస్టాండ్ వద్ద గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడకు చెందిన శ్రీనివాస్ కారులో తరలిస్తున్న రూ.2.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ఆ నగదును సీజ్ చేశారు.

బూత్ కన్వీనర్లదే కీలకపాత్ర

పి.గన్నవరం, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి బూత్ కన్వీనర్లే కీలకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. పి.గన్నవరం ఉమ్మడి పార్టీ కార్యాలయంలో జరిగిన బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్య నారాయణ, నక్కా సత్యనారాయణ, చొల్లంగి సత్యనారా యణమూర్తి, కె.సత్యనారాయణరాజు, పప్పుల సాయిబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, గుత్తుల రామకృష్ణ, నేలపూడి దామోదరం, త్సల్లా బిందుమాధవరావు, ఆరుమిల్లి సాయిబాబు, వాసంశెట్టి కుమార్, ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు శ్రీనుబాబు, గోగి రమేష్, కర్రి వెంకటరత్నం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

మామిడికుదురు, మే 2: పాశర్లపూడిలంక గ్రామంలోని పితానివారిమెరకలో గల డబ్బా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు పట్టించుకోలేదని మహిళలు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈట్రాన్స్‌ఫార్మర్‌పైన గ్రామానికి తాగునీరు అందించే పంచాయతీ తాగునీటి బోర్లు ఉన్నాయని, దీని వల్ల తాగునీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. అధికారులు స్పందించి వెంటనే పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు పింఛన్ పెంపు

మలికిపురం, మే 2: ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుతో అన్ని వర్గాల ప్రజలతో పాటు దివ్యాంగులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వర ప్రసాద్ అన్నారు. మలికిపురంలో దివ్యాంగులతో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రాబోయే ప్రభుత్వంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించారని, ఎస్సీలకు సంబంధించిన 27పథకాలను రద్దుచేశారన్నారు. గుడిమెల్లంక, మేడిచర్లపాలెం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కూటమి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాజోలు నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అడబాల యుగంధర్, చెల్లింగి సత్యనారాయణ, అన్నంనీడి పురుషోత్తం, ముత్యాల శ్రీనివాస్, మల్లిపూడి సత్తిబాబు, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, మంగెన భూదేవి, బందెల పద్మ, మోకా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గొలుసు చోరీ కేసులో ఏడాది జైలు శిక్ష

కె.గంగవరం, మే 2: గొలుసు దొంగతనం కేసులో వ్యక్తి ఏడాది జైలు శిక్ష పడింది. గత ఏడాది మార్చి 30న కోటిపల్లికి చెందిన సాదనాల వరలక్ష్మి మెడలో రెండు కాసుల బంగారం గొలుసును కాకినాడకు చెందిన గాడా సురేష్ అపహరించాడు. రామచంద్రపురం కోర్టు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

సత్యవాడలోని రామేశ్వరపు వీర వెంకటసత్యనారాయణ కుటుంబ సభ్యులు ఇంటిలో లేని సమయంలో గత ఏడాది నవంబరు 30న శివాలయానికి సంబంధించిన బంగారు, వెండి వస్తువులు దొంగలు అపహరించారు. ఈకేసులో నింది తులు పిల్లి సురేష్, ఉండి శివసుబ్రహ్మణ్యం, బోగడ శ్రీను లను ఆరెస్టుచేసి ఆరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు పామర్రు ఎస్ఐ కె.జానీబాషా తెలిపారు. ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ జానీబాషా చెప్పారు.

పురుగుల మందు తాగిన మహిళ మృతి

తమ్మయ్యపాలేనికి చెందిన పినపోతు లక్ష్మి(50)పురుగుల మందు తాగింది. భర్త మద్యం తాగడం మానడం లేదని, భర్తను భయపెట్టాలని ఇంటిలో ఉన్న పురుగుల మందును ఆమె తాగింది. కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రన్న ప్రజా పాలన కోసం ఎదురుచూపులు




వానపల్లిలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న బండారు, బిళ్ళకూరులో ప్రచార రథంపై విజయకేతనం చూపుతున్న బండారు మనువడు సత్యాన్స్

కొత్తపేట, మే 2: వైసీపీ అరాచక పాలనను అంతమొం దించి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ద్వారా ఏర్పడే చంద్రన్న పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆయన బిళ్ళకూరు, వానపల్లి గ్రామాల్లో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు పుష్ప మాలలు వేసి, హారతులు ఇచ్చి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. తొలుత బండారు వానపల్లి పల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా మన్ననలను చూస్తుంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమనిపిస్తోంద న్నారు. అన్నివర్గాల సంక్షేమం కోసం ఉమ్మడి మేని ఫెస్టో రూపొందించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా అభివృద్ధి కనిపించక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ధరల భారంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారన్నారు. గిట్టుబాటు ధర లేక, పంట పండించడానికి సాగునీరు లేక రైతుల కష్టాలు వర్ణనాతీతమన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనను అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల న్నారు. కొత్తపేట ఎమ్మెల్యేగా తనను, అమలాపురం ఎంపీగా హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వాడపాలెం, వానపల్లి గ్రామాలకు చెందిన వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి సత్యానందరావు కండు వాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

ఆత్రేయపురం, మే 2: టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో ఆత్రేయపురంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి స్వాగతించారు.



ఆత్రేయపురంలో టీడీపీలో చేరిన వారితో యువ నేత సంజీవ్

కూటమి మేనిఫెస్టోకు అపూర్వ స్పందన




పొట్టిలంకలో గిడ్డి సత్యనారాయణకు హారతులిస్తున్న మహిళలు, మడుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గిడ్డి సత్యనారాయణ



పొట్టిలంకలో జనసేనలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, మే 2: కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని పి.గన్నవరం నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం అయినవిల్లి మండల పరిధిలోని మడుపల్లి, చింతనలంక, వెలువలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీచోటా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మండుటెండలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన నదీకోత నివారణకు, లంక గ్రామాలకు ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు, ఏటిగట్ల పటిష్టతపై ప్రధానంగా దృష్టి సారిస్తానన్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, ప్రతీ మహిళకు నెలకు రూ.1500, 50ఏళ్ల నిండి బీసీలకు రూ.4వేలు పెన్షన్ అందిస్తామన్నారు. యువతలో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జనసేనలో చేరికలు

పొట్టిలంకలో వైసీపీకి చెందిన పలువురు జనసేనలో చేరారు. పి.గన్నవరం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ సమక్షంలో వారు చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సలాది బుచ్చిరాజు, మామిళ్లపల్లి తాతయ్యనాయుడు, బద్రి శ్రీనివాసరావు, వడ్డి శ్రీనివాసరావు, మద్దా రాంబాబు, విళ్ల నవీన్, చిట్టూరి శ్రీనివాసరావు, సయ్యపరాజు సత్యనారాయణరాజు, సలాది బాబూరావు, బొబ్బిలి అయ్యప్ప, గుమ్మిడి వెంకటేశ్వరరావు, మోత వెంకటేశ్వరరావు, నేదునూరి వీర్రాజు, విళ్ల రాము, సలాది పుల్లయ్యనాయుడు, మట్టపర్తి రాజేశ్వరరావు, దంగేటి వెంకటరమణ, నిమ్మకాయల సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, జంగా డేవిడ్ రాజు, మద్దాల సుబ్బారావు, డొక్కా నాథ్‌బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు





కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్నికల ప్రచారం, వేగుళ్లను సన్మానిస్తున్న వృద్ధుడు, జోగేశ్వరరావుకు హారతి ఇస్తున్న మహిళ

మండపేట అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు




మండపేట పట్టణం, మారేడుబాకలో ప్రచారం చేస్తున్న వేగుళ్ల కుటుంబ సభ్యులు, వేగుళ్ల కుమార్తెలు

కపిలేశ్వరపురం, మే 2: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, మాచర గ్రామాల్లో ఆయన నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు గజమాలలు, పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మహిళలు అడుగడుగునా హారతులిచ్చి ఆశీర్వదించారు. కూటమి ప్రభుత్వం ద్వారా యువతకు 20లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15వేలు, ప్రతీ రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం, 19నుంచి 59ఏళ్ల వరకూ ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ప్రతీ ఇంటికి ఏడాదికి ఉచితంగా 3గ్యాస్‌సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం వంటి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పెన్షన్‌ను రూ.4వేలకు పెంచుతూ ప్రతీనెలా ఇంటి వద్దే అందజేయనున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పునరుద్ధరిస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అనేక పథకాలను సీఎం జగన్మోహనరెడ్డి రద్దుచేసి పేదల పొట్టకొట్టారన్నారు. ఈప్రభుత్వంలోని పథకాలన్నింటిని టీడీపీ అధి నేత చంద్రబాబు అమలు చేస్తారన్నారు. పథకాలన్నీ అమలు జరగాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా హరీష్‌మాధుర్‌ను గెలిపించాలని కోరారు.

వేగుళ్ల కుమార్తెల ప్రచారం

మండపేట, మే 2: ఓటనే వజ్రాయుధంతో ఐదేళ్ల నుంచి సాగుతున్న వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ యువనేతలు ఓటర్లను కోరారు. కూటమి అభ్యర్థులు వేగుళ్ల జోగేశ్వరరావు, హరీష్‌మాధుర్ విజయం కోరుతూ గురువారం వేగుళ్ల కుమార్తెలు, కుటుంబ సభ్యులు మండపేట పట్టణం, మండలంలో ప్రచారం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లేకుండా ఐదేళ్ల పాలనలో సీఎం జగన్, ఆయన అనుచరులు బాగుపడ్డారే తప్ప ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. ఇసుక,మట్టి, గ్రావెల్‌నుదోచుకోవటం, ప్రభుత్వ భూములు కబ్జాలు చేయటంతప్ప చేసిందేమి లేదన్నారు. వేగుళ్ల పెద్దకుమార్తె మణిమంజరి, ముత్యాల మణిమంజరి, కోడలు వేగుళ్ల లక్ష్మీశిల్పలు టీడీపీ మహిళా నేతలతో కలిసి మారేడుబాకలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్న కుమార్తె సాయిమణిమంజరి ఏడిదలో స్థానిక మహిళా నేతలతో కలిసి ప్రచారం చేశారు. కూటమి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ యువనేతలు వల్లూరి సాయికుమార్‌బాబు, వేగుళ్ల అజయ్‌బాబు, మున్సిపల్ మాజీచైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి రామన్న చౌదరి వేర్వేరుగా పట్టణంలో 26,27,4,5 వార్డుల్లో ప్రచారం చేశారు. కాళ్లకూరి స్వరాజ్యభవాని, శిరంగు జ్యోతి, చింతలపూడి దుర్గ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గడి సత్యవతి, మాజీ కౌన్సిలర్ వల్లూరి ఇందిరారాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కోలుప్రోలు బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా పాలన: సుభాష్





ద్రాక్షారామ: వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, బాలుడితో సుభాష్, దంపతులకు అభివాదం చేసి ఓటు అభ్యర్థిస్తున్న సుభాష్




ద్రాక్షారామ: లెప్రసీకాలనీవాసులతో మాట్లాడుతున్న సుభాష్, కాజులూరు: గొల్లపాలెంలో సుభాష్ సతీమణి సునీత ప్రచారం

రామచంద్రపురం, మే2: కూటమి ప్రభుత్వంతోనే ప్రజా పాలన అందుతాదని నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈనెల13న జరుగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సుభాష్ ఓటర్లను కోరారు. గురువారం రామచంద్రపురం పట్టణంలో 15,16,17,18,19,20వార్డుల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ముందుగా లలితానగర్ వద్ద నుంచి ఎన్నికల ప్రచారం మెయిన్‌రోడ్డు, రత్నంపేట, కమ్మవారి సావరం, వీఎస్ఎం కళాశాల ప్రాంతం, చప్పిడివారి సావరంలో పర్యటించారు. కమ్మవారి సావరంలో మత్స్యకారకాలనీలోని రామాలయంలో మత్స్యకారుల సమస్యలడిగితెలుసుకున్నారు. పట్టణంలో పర్యటించిన సుభాష్‌కు పలువార్డుల్లో ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులిచ్చారు. పుష్పాలు జల్లి అభిమానం చాటుకున్నారు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కే గోపాల్‌బాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు గిరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కొమరిన వీర్రాజు, కొసనా శ్రీనివాసరావు, నారపురెడ్డి బలరాం, అధికసంఖ్యలో టీడీపీ,జనసేన,బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుభాష్‌కు మద్దతుగా సతీమణి ప్రచారం

కాజులూరు, మే 2: గొల్లపాలెంలో రామచంద్రపురం నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సతీమణి లక్ష్మిసునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌ను, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుబ్బల ఏసురాజు, చుండ్రు వీర్రాజు చౌదరి, అంగర శ్రీను, అంగర కృష్ణ, జనసేన నాయకులు తోట కృష్ణ, దేగల సతీష్, నాని, కుంచు స్థంభం బుజ్జి, వల్లు అర్జునరావు, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, సోవాలమ్మ, లక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, మే 2: కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల3న ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. చెయ్యేరు, చెయ్యేరుఅగ్రహారం, ఉప్పూడి, సావరం, పెనుమెల్ల, లక్ష్మీవాడ, బంటుమిల్లి, సీహెచ్ గున్నేపల్లి, అనాతవరం, కాట్రేనికోన టౌన్, వేట్లపాలెం, జీకే పోర, చిర్రయానాం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట, పండి, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రాయవరం: రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల సరఫరాను నిలిపివేస్తున్నట్టు డీఈఈ వై.విజయానంద్ తెలిపారు. రాయవరం, వెదురుపాక, నదురుబాద, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, బిక్కవోలు మండలం పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ముమ్మిడివరం: విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పదకొండు ఫీడర్లపై శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7నుంచి 9గంటల వరకు రాణేలంక ఫీడర్ పరిధిలోని, ముమ్మిడివరం పట్టణం రాజుపాలెం, పల్లిపాలెం, నడిమిలంక,చిప్పలపాలెం, రాణేలంక, లంకాఫ్ రాణేలంక, క్రాప చింతలపూడి, క్రాపచింతలపూడిపాలెం, గురజాపులంక గ్రామాల్లో, ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2గంటల సీహెచ్ గున్నేపల్లి, అనాతవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'సలాది'కి కూటమి నేతలు నివాళి

కొత్తపేట, మే 2: కాపు నాయకుడు సలాది స్వామినాయుడు (అబ్బాయి కాపు) వర్ధంతి సందర్భంగా ఆయనకు కూటమి నేతలు నివాళులర్పించారు. స్వామినాయుడు పేరుతో కొత్తపేటలో శ్మశానవాటిక నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ఆయన కుమారుడు, జనసేన నాయకుడు సలాది రామకృష్ణ అందించారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్, నేతలు ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, బండారు సూర్యనారాయణమూర్తి, త్సల్లా ప్రభాకర్, నెల్లి లక్ష్మీపతి, విళ్ల వీరమారుతీప్రసాద్, యల్లమిల్లి జగన్మోహన్, గుబ్బల మూర్తి, ఎస్‌వీవీఎస్ రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.